

చిన్నారులతో ముచ్చటిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

ఆటపాటలతో చదువు నేర్పించాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ చిన్నారులకు నిత్యం పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ ఆటపాటలతో చదువు నేర్పించాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఆదేశించారు. పోషణ్ బీ పడాయి బీ ఓరియెంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అలియాబాద్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడున్న చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం కేంద్రంలోని వంట సామగ్రిని, ఆహార పదార్థాలను పరిశీలించారు. చిన్నారులకు, తల్లులకు, గర్భిణులకు నిత్యం సక్రమంగా ఆహారం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో చిన్నారులకు నిత్యం పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా అందించాలన్నారు. అంగన్‌వాడీ పిల్లల, తల్లుల, గర్భిణుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శారద, సూపర్‌వైజర్, టీచర్లను ఆదేశించారు.

గోల్ఫ్ పోటీల్లో జమాల్ అగ్రస్థానం

పూడూరు, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ పోటీల్లో బంగ్లాదేశ్ గోల్ఫర్ జమాల్ హొస్సేన్ తొలి రోజు సత్తా చాటాడు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నేపల్లి ఊటీ గోల్ఫ్ కౌంటీలో జరిగిన తొలి రౌండ్ పోటీల్లో జమాల్ 9 అండర్ 61 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచాడు. చండీగఢ్ గోల్ఫర్ అక్షయ్ శర్మ 8 అండర్ 63 స్కోరుతో ద్వితీయ, గుర్గావ్ గోల్ఫర్ తాపేంద్ర ఘై 7 అండర్ 64 స్కోరుతో తృతీయ స్థానంతో సరిపెట్టుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పత్తి కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు

» వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ , సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి పత్తి పంటను కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో పత్తి కొనుగోళ్లపై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2,46,725 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, 2,68,282 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని వివరించారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభం కానున్న దృష్ట్యా జిన్నింగ్ మిల్లుల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్లకు ఆధార్ తప్పనిసరి అని రైతులందరూ తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం గ్రేడ్ 1 పత్తి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.8,110, గ్రేడ్ 2 పత్తికి రూ.7,710 చొప్పున నిర్ణయించిందన్నారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఫైర్ శాఖ తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 14 జిన్నింగ్ మిల్లుల ద్వారా సీసీఐ ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం పత్తి కొనుగోలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, సీసీఐ అసిస్టెంట్ మేనేజర్ ప్రజ్ఞ, మార్కెటింగ్ అధికారి సారంగపాని, వ్యవసాయ అధికారి రాజారత్నం, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, విద్యుత్, రవాణా, పోలీస్ అధికారులు, ట్రేడర్లు తదితరులు పాల్గొన్నారు.



↑ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీవారి కల్యాణం

వికారాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామిఆలయంలో శ్రీవారి రజతోత్సవ బ్రహ్మోత్సవాలు కనుల పండుగగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయంలో సుప్రభాత సేవ, మహాభిషేకం, నైవేద్యం, మంగళహారతి, దర్శనాల అనంతరం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ తంతును వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయంత్రం శేష వాహనంపై స్వామి వారి ఊరేగింపు నిర్వహించి ఊయల సేవ వేడుక నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



గంజా పంజా

చాపకింద నీరులా గంజాయి



పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా గంజాయి పంజా విసురుతోంది. రోజురోజుకు గంజాయిని ఉపయోగిస్తున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చిన్న చిన్న ప్యాకెట్లలో విక్రయిస్తూ యువతను మత్తులోకి దించుతున్నారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నుంచి రైలు మార్గం ద్వారా యథేచ్ఛగా గంజాయి ప్యాకెట్లు జిల్లాకు చేర్చుతున్నారు. జిల్లాలోని ప్రతీ గల్లీలో బాధితులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి దందాపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

270 మందిని బైండోవర్ చేశాం



జిల్లాలో గంజాయి నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. రైళ్లలో సైతం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 270 మందిని బైండోవర్ చేయడంతో పాటు 125 కేసులను నమోదు చేశాం. గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలు, యువకుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. కళాశాలలతో పాటు రద్దీ ప్రదేశాల్లో చైతన్య కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తాం. గంజాయి నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

-విజయభాస్కర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఏళ్లుగా జిల్లాలో సాగుతున్న దందా

మత్తులో జోగుతున్న యువత

ఇరానీగల్లీ టు వికారాబాద్‌కు తరలింపు

రైలు మార్గం ద్వారా జిల్లాకు చేరవేత

మొక్కుబడిగా ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



వికారాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంతో పాటు గ్రామీణ యువత కూడా గంజాయి మత్తుకు బానిసలుగా మారుతున్నారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, ప్రతీ గల్లీలో 10 నుంచి 50 మంది వరకు ఈ మత్తుకు బానిసలుగా మారారంటే అతిశయోక్తి కాదు. గంజాయి కోసం రాష్ట్రం దాటి మరీ వెళుతున్నారు. సమయానికి గంజాయి దొరక్క పోతే ఉండలేని దుస్థితికి చేరుకున్నారు. వికారాబాద్ పట్టణంలో గంగారం, కొత్తగడి, గరీబ్‌నగర్, ఆలంపల్లి, రాజీవ్ గృహకల్ప తదితర కాలనీల్లో మిగతా 8వ పేజీలో...

మొద్దు నిద్రలో ఎక్సైజ్ అధికారులు

గంజాయి అక్రమంగా సరఫరా కాకుండా నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. కల్లు తయారీ, విక్రయ కేంద్రాలు, బెల్టు దుకాణాల నుంచి అక్రమ వసూళ్లపైన ఎక్సైజ్ అధికారులకు ఉన్న శ్రద్ధ గంజాయిని నియంత్రణలో లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా అధికారుల తీరు కనిపిస్తోంది. తనిఖీల్లో గంజాయి పట్టుబడితే కేసు చేస్తామనే ధోరణి తప్ప గంజాయి మత్తులో రోడ్లపై పడిపోయి ప్రమాదాలకు, ఇతర సంఘటనలకు కారణమవుతున్నా పట్టించుకోని దుస్థితి.



← గునుగు పువ్వును సేకరిస్తున్న మహిళలు



↑ విక్రయానికి ఆటోలో తరలిస్తూ..

బతుకునిస్తున్న 'బతుకమ్మ'!

పూల సేకరణతో ఉపాధి

బతుకమ్మ పండగ పలువురికి ఉపాధిని అందిస్తోంది. బతుకమ్మను పేర్చడానికి అవసరమైన పూలను సేకరించి వాటిని విక్రయిస్తూ పలువురు మహిళలు కూలీ డబ్బులు సంపాదిస్తున్నారు. పెద్దేముల్ మండలంలోని పలు గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో ఎర్ర, తెల్ల రంగులలో గునుగుపూలు విరివిగా లభిస్తున్నాయి. తట్టెపల్లి, పెద్దేముల్, జనగాం, రుక్మాపూర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం గునుగు పూలను సేకరిస్తున్న మహిళలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

-పెద్దేముల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి)



ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీ నగర్‌లో..

బాలాత్రిపుర సుందరిగా..

భక్తులకు అమ్మవారి దర్శనం

జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని శ్రీరామ కల్యాణ కామేశ్వరీ నవశక్తి ఆలయంలో మంగళవారం అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కీసర గుట్టలో భవానిమాత దేవి అలంకరణలో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-ఘట్‌కేసర్/కీసర, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి)



కీసరగుట్టలో భవానీ మాత

ఉల్లి.. తల్లడిల్లి!



భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి నారు



సంకిరెడ్డిపల్లి శివారులో దెబ్బతిన్న ఉల్లినారు

200 ఎకరాల్లో మునిగిన మొలక

మిట్టబాస్పల్లిలోనే రూ.20 లక్షలు నష్టం

యాసంగికి నారు అందని పరిస్థితి

సబ్సిడీ విత్తనాలకు డిమాండ్

తాండూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తాండూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రధానపంటగా సాగు చేస్తున్న ఉల్లినారు నీటిలో మునిగిపోయింది. దీంతో దిగుబడి సమయానికి దిగుబడి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ఐనెల్లి, సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండా, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, కోటబాస్పల్లి, సంగెం కలాన్, మల్కాపూర్, కొత్లాపూర్, ఉద్దండాపూర్, జినుగుర్తి, జినుగుర్తితండా,

మిగతా 8వ పేజీలో...

నారు మురిగిపోయింది



నాకున్న నాలుగెకరాల్లో ఉల్లి పంట వేసేందుకు ముందుగా నారు కోసం రూ.1,200లకు కిలో చొప్పున కర్ణాటక నుంచి విత్తనాలు తీసుకువచ్చి చల్లాను. భారీ వర్షాలకు నారంతా మురిగిపోయింది. మళ్లీ నారు వేయాలంటే విత్తనం కొనసాల్సిన పరిస్థితి. ప్రభుత్వం సబ్సిడీపై ఉల్లి విత్తనాలు అందజేయాలి.

- రాంశెట్టి, ఉల్లి రైతు, సంకిరెడ్డిపల్లితండా

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లాంగ్ పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలని వాటిపై డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు దృష్టి పెట్టాలని ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేసుల కన్విక్షన్ శాతాన్ని పెంచడం, నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేపట్టడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నేర నియంత్రణ, పరిశోధనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ఆయన చర్చించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యక్తుల కోసం రూములు అద్దెకు ఇచ్చే ముందు ఇంటి యజమానులు పాన్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ ఫోన్ నంబర్ వంటి వివరాలను ధ్రువీకరించుకోవాలని సూచించారు. అదనంగా రిటైర్డ్ పీపీ పి.రాములుతో ఎస్‌హెచ్‌వోలు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, తాండూరు, పరిగి, వికారాబాద్ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రేడియల్ రోడ్డు నిర్మాణం వద్దు

నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పరిగి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రంగాపూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు నిర్మించ తలపెట్టిన రేడియల్ రోడ్డు నిర్మాణ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ, మంగళవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రంగాపూర్, మాదాపూర్, మంచర్‌పల్లి తదితర గ్రామాల రైతులు పరిగిలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్లకార్డులతో తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికే ఉన్న రోడ్డును వెడల్పు చేస్తే సరిపోతుందని, 330 ఫీట్ల రోడ్డు వేయడం ద్వారా తాము తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. పూడూరు మండలం దామగుండంలో నిర్మిస్తున్న నేవీరాడార్ ద్వారా పుణ్యక్షేత్రం పరిసరాల్లో ఉన్న పచ్చని చెట్లు లేకుండా చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి వెనక్కి తీసుకోవాలని వారు కోరారు.

అనంతుడికి హనుమంత వాహనసేవ



దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలంపల్లి అనంతపద్మనాభ స్వామి దేవాలయంలో బ్రహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నిత్య వాహన పూజలో భాగంగా మంగళవారం స్వామి వారిని హనుమంత వాహనసేవపై ఊరేగించారు. దేవాలయ పరిసరాలు, గ్రామ పుర వీధుల గుండా స్వామి వారిని ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి పద్మనాభం, కార్య నిర్వాహణాధికారి నరేందర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

వికారాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి)

నల్సార్‌లో విద్యార్థి అనుమానాస్పద మృతి

శనివారం అర్ధరాత్రి మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

మృతిపై విద్యార్థుల పలు రకాల అనుమానాలు

మృతదేహం ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు తరలింపు

7

రిజర్వేషన్లు ఖరారు

7

ప్రభుత్వానికి నివేదిక పంపిన జిల్లా యంత్రాంగం

బీసీ రిజర్వేషన్ల జీవో విడుదల అనంతరం ప్రకటన!

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/నందిగామ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఫెమీనా మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే శంకర్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌లు హాజరైనారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫెమీనా మహిళా సేవా మండలి 400 మందికి ఉపాధి శిక్షణ ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి ఎంతగానో తోడ్పాటునివ్వడం హర్షణీయమన్నారు. త్వరలోనే షాద్‌నగర్ పట్టణంలో మహిళల కోసం వృత్తి నైపుణ్యత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయించేదుకు కృషి చేస్తానని తెలిపారు. కొత్వాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మహిళ కోసం 400 కుట్టు మిషన్లు అందజేశామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బాబర్ అలీఖాన్, పి.రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, ఎండీ ఇబ్రహీం, షాద్‌నగర్ పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా, ఫెమినా అధ్యక్షురాలు ఆలియా పాల్గొన్నారు. అలాగే నందిగామ మండల పరిధిలోని పృథ్వీ కాలనీలో హెచ్ఎండీఏ నిధులు రూ.80 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణం, నర్సప్పగూడలో రూ.12లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం, గ్రామంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు, నర్సప్పగూడ-చేగూర్ రోడ్డులో వంతెనపై రూ.72 లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి శంకుస్థాపనలు చేశారు. నర్సప్పగూడలో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్‌కు అవకాశాలు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, పసుల బుచ్చయ్య, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కావలి కృష్ణ, సత్తయ్య, నర్సింలు, హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవిందర్, శేఖర్, శ్రీశైలం, శివ, సాములయ్య, నవాజ్‌రెడ్డి పాల్గొన్నారు.


షాద్‌నగర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

అందరికీ మెరుగైన వైద్యం

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యం అందేలా పీహెచ్‌సీల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ గీత అన్నారు. స్వస్థనారి-స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మంగళవారం రాచులూరు ప్రాథమికఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహింగా గీత మాట్లాడారు. శిబిరంలో 162 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. వైద్యాధికారి సంధ్యారాణి, సౌజన్య, సీహెచ్‌వో మున్వర్, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, యాదమ్మ, మణెమ్మ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ బాధితులకు అండగా బీఆర్ఎస్

ఆమనగల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చినట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతుల జీవితాలను ఆగం చేస్తోందని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను జైపాల్‌యాదవ్ కలిశారు. బాధిత రైతులకు భరోసా ఇచ్చి అలైన్‌మెంట్ మార్పునకు చేపట్టే కార్యాచరణకు ఈనెల 25న మధ్యాహ్నం ఒంటిగంటకు తెలంగాణ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు అభిప్రాయాలను తెలుపాలని కోరారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, భాస్కర్‌రావు, తదితరులు ఉన్నారు.


కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న జైపాల్ యాదవ్, అర్జున్‌రావు

దసరాను శాంతియుతంగా జరుపుకోవాలి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలు ప్రజలంతా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయించాలని, రోడ్లపక్కన పిచ్చి చెట్లు, చెత్తను తొలగించాలని, వార్డుల్లో లైట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ శంకర్ నాయక్‌ను ఆదేశించారు. పాత శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని సీఐ జానకిరామ్ రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, తహసీల్దార్ ఫయాద్దీన్, కమిషనర్ శంకర్‌నాయక్‌లతో కలిసి పరిశీలించారు. కళాశాల భూ వివాదాన్ని పరిష్కరించి తమకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన లండం చిన్న జంగయ్య ఎమ్మెల్యేను కోరారు. ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు, జగన్, మానయ్య, అప్పం శ్రీను, బాబా, కృష్ణానాయక్, ఖాదర్, వస్పుల శ్రీకాంత్, అవ్వారి శివలింగం, తదితరులు ఉన్నారు.


కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

అలాగే, ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి మండలాల్లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు బాధితులను పరామర్శించి వైద్య చికిత్సలకు ఆర్థికసాయం అందజేశారు. శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, భట్టు కిషన్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, నాయకులు తదితరులున్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

కడ్తాల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని కడ్తాల మండల హైటెన్షన్ విద్యుత్ లైన్ భూ నిర్వాసితులు స్పష్టం చేశారు. కడ్తాల మండల కేంద్రంలో బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపడుతున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం 16వ రోజుకు చేరాయి. కానుగుల సత్యనారాయణ, శ్రీరాములు, యాదయ్య, వెంకట్రాములు, వెంకటేశ్‌లు కూర్చున్నారు. కడారి రామకృష్ణ, పెంటారెడ్డి, పాండుయాదవ్, కృష్ణ, అమృతం, మహేశ్ పాల్గొన్నారు.

దేవరయంజాల్ భూములు

ఆలయానికి చెందినవే..

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట్ మండలం దేవరయంజాల్ గ్రామంలోని 1,521 ఎకరాల భూములు స్థానిక శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందినవేనని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఆలయ భూములను ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా తమ పేర్లపై మార్చుకుని రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేసుకున్నారని పేర్కొంది. గ్రామంలోని సర్వే 688 నుంచి 712 వరకు ఉన్న వివిధ సర్వే నెంబర్లలో ఉన్న భూములను నిషేధిత జాబితాలో చేరుస్తూ సీసీఎల్‌ఏ 2014లో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో దాదాపు 300 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దేవదాయ చట్టాల ప్రకారం ట్రిబ్యునల్‌కు వెళ్లకుండా పిటిషనర్లు నేరుగా హైకోర్టుకు రావడం చెల్లదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ల వాదనల కోసం విచారణను వాయిదా వేసింది.

అక్రమ కేసులు బనాయిస్తున్న కాంగ్రెస్


నిరసన ర్యాలీలో ఉప్పల వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పథకం ప్రకారం అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆరోపించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని విజేశ్‌నాయక్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆమనగల్లులో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదలైన విజేశ్‌నాయక్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చుక్క నిరంజన్‌గౌడ్, దోనాదుల కుమార్, జ్యోతయ్య, మహేశ్, వెంకటేశ్, గణేశ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం

మహేశ్వరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, ప్రతీ ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని జిమ్స్ ఆసుపత్రి వైద్యురాలు ఉమారాణి అన్నారు. మంగళవారం అమీర్‌పేట గ్రామంలో జిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు ఉచిత వైద్యశిబిరాలు, అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి


రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేసిన అధికారులు

ఇబ్రహీంపట్నం/యాచారం 23(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి బసవన్నప్ప సూచించారు. యాచారం మండలం చౌదర్‌పల్లిలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం రైతు పొలం బడి కార్యక్రమంలో భాగంగా టమాట తోటలో రైతు క్షేత్ర పాఠశాల నిర్వహించారు. బసవన్నప్ప మాట్లాడుతూ పురుగు మందులను అవసరం మేరకే వాడాలని సలహాలు, సూచనలు చేశారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌పీఎస్ఎస్ అనే మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు. వ్యవసాయ విస్తరణాధికారి రాధ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందజేస్తాం


కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉష, తదితరులు

షాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఉష తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం షాబాద్ సహకార బ్యాంకు గోదాంను పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ నేడు(బుధవారం) షాబాద్, నాగర్‌గూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో యూరియా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సురేష్ బాబు, కృష్ణమోహన్, ఏఈవోలు కిరణ్మయి, రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో పశువైద్యులు

జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం

తాండూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న పశువైద్య ఏడీఏ కార్యాలయంలో ఇప్పటి నుంచి వైద్యులు అందుబాటులో ఉంటారని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం అన్నారు. ఆయన మంగళవారం ఏడీఏ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువైద్య ఏడీఏ కార్యాలయానికి యాలాల మండల పశువైద్యాధికారి శివదుర్గాను నియమిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇన్‌చార్జి ఏడీఏగా ఉన్న కొడంగల్ ఏడీఏ నోహను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించినట్లు తెలిపారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ప్యారమేట్ అశోక్ (సోమ, మంగళ, బుధ వారం). కుక్కింద సబ్‌సెంటర్ ప్యారమేట్ సైదులు (గురు, శుక్ర, శనివారం) రైతులకు అందుబాటులో ఉంటారని అన్నారు. యాలాల మండల పశువైద్యాధికారి ప్రతీరోజు మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రిలో అందుబాటులో ఉంటారన్నారు. జిల్లాలో 33 మండల పశు వైద్యులకు 15పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 60 ప్యారమేట్ సిబ్బందికి 25 ఖాళీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. పశుగ్రాసం విత్తనాలు 10క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, 75శాతం సబ్సిడీపై పాడి రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న డాక్టర్ సదానందం

'శాకాహార ర్యాలీ'ని విజయవంతం చేయాలి

చేవెళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న చేవెళ్లలో నిర్వహించే మహకరుణ అహింసా-శాకాహార ర్యాలీని విజయవంతం చేయాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నడిమొళ్ల శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 28న కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సామూహిక ధ్యాన కార్యక్రమం భారీఎత్తున నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సీహెచ్ ప్రభాకర్, తాజొద్దీన్ తదితరులు ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకర్ తదితరులు


పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రారంభమైన పనులు

బషీరాబాద్‌లో రోడ్డు పనులు షురూ

బషీరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'అధ్వానంగా రోడ్డు' అనే శీర్షికన ఈనెల 20వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. బషీరాబాద్‌లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఎక్స్‌కవేటర్‌తో రోడ్డంతా తవ్వి కొద్ది రోజులుగా వదిలేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రోడ్డు పనుల జాప్యంపై ఆరాతీసి వెంటనే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్ ఆదేశించినట్లు సమాచారం. ఎట్టకేలకు కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి వదిలేసిన గుంతలో మట్టి నింపే పనులను మంగళవారం ప్రారంభించారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభకావడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


పట్టుబడిన బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

తండాల్లో ఎక్సైజ్ దాడులు

» ఐదుగురిపై కేసు నమోదు

బషీరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 350 లీటర్ల బెల్లం పానకం, తొమ్మిది లీటర్ల సారాయిని పట్టుకుని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో వికారాబాద్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ విజయభాస్కర్ నేతృత్వంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో ఎక్సైజ్ అధికారులు కొత్లాపూర్‌తండా, నంద్యానాయక్ తండా, వాల్యానాయక్‌తండా, జమ్లానాయక్‌తండాల్లో దాడులు జరిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం సారాయిని సీజ్ చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తాండూరు ఎక్సైజ్ సీఐ ఆదిశేషురెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో కొండంగల్, మోమిన్‌పేట్, వికారాబాద్, డీటీఎఫ్ బృందాలు పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

మహిళలందరికీ చీరలు పంపిణీ చేయాలి

పరిగి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా బతుకమ్మ చీరలను మహిళలందరికీ ఇవ్వాలని సీపీఐ పరిగి డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కేవలం మహిళా సంఘాల్లోని సభ్యులకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించడం సబబు కాదన్నారు. తెలంగాణలోని మహిళలందరినీ గౌరవించాలని డిమాండ్ చేశారు. కొందరికి ఇచ్చి, మరికొందరికి ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. ఇది ఒకరకంగా మహిళలను అవమానించడమేనని విమర్శించారు. కొంతమందికే ఇస్తే లాభం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుందనే విషయాన్ని పాలకులు గుర్తించాలని సూచించారు. రాష్ట్రంలోని మహిళలందరికీ బతుకమ్మ చీరలను ఇవ్వాలని కోరారు.


పీర్‌మహ్మద్

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

» రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.8లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎంతో మంది నిరుపేదలకు కోట్లాది రుపాయలు వెచ్చించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడని, భవిష్యత్‌లో రాష్ట్రాన్ని ఎంతో ఉన్నత స్థితికి తీసుకెళ్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నీరటి రాజు ముదిరాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, దండు ఇస్తారి, జిట్టి సిద్దులు, సతీష్‌యాదవ్, అనేగోని శ్రీకాంత్‌గౌడ్, నాయకలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారి ఊరేగింపులో ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

చేవెళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరాను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి బ్రహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈమేరకు మంగళవారం ఆలయంలో వేంకటేశ్వర స్వామికి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే యాదయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఊరేగింపు అనంతరం పల్లకీసేవాలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మురళీ నాయక్‌కు డాక్టరేట్

కడ్తాల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండికి చెందిన కేహెచ్ మురళీ నాయక్ డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఆయన షాబాద్‌లోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. విద్య నైపుణ్యం పట్ల నిబద్దత, అనేక విషయాలపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.



రిజర్వేషన్లు ఖరారు!

» సీల్డ్ కవర్‌లో ప్రభుత్వానికి నివేదిక పంపిన జిల్లా యంత్రాంగం

» బీసీ రిజర్వేషన్ల జీవో విడుదల తర్వాత ప్రకటించే అవకాశం



వికారాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవుల్లో 42 శాతం మేరకు బీసీలకు రిజర్వు చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2011 జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించనుండగా, తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వే ప్రాతిపదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. జడ్పీటీసీ, మండల పరిషత్ అధ్యక్ష స్థానాలను జిల్లా కలెక్టర్ ఖరారు చేయగా, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులను ఆర్డీవో ఖరారు చేశారు. గ్రామ పంచాయతీల వారీగా వార్డుల రిజర్వేషన్లను ఎంపీడీవో ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. యనున్నారు. గత ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించిన స్థానాలను ఈసారి మినహాయించి, మిగిలిన స్థానాలను ఆయా వర్గాలకు రిజర్వు చేసినట్లు తెలుస్తోంది. సోమ, మంగళవారాలు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ నేతృత్వంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు రాత్రింబవళ్లు శ్రమించాల్సివచ్చింది. ఎట్టకేలకు మంగళవారం రాత్రి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వానికి సీల్డ్ కవర్‌లో నివేదిక పంపించారు.

బీసీలకు 42 శాతం...

వికారాబాద్ జిల్లాలో 20 మండలాల్లో 594 గ్రామ పంచాయతీలు, 5058 వార్డులు, 20 జడ్పీటీసీలు, 227 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖాయమైతే... జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాల్లో బీసీలకు 8 లేదా 9 జడ్పీటీసీ పదవులు బీసీలకు ఖరారు చేసే అవకాశం ఉంది. మండల పరిషత్తు అధ్యక్ష పదవులు కూడా ఇదే సంఖ్యలో ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. 227 ఎంపీటీసీ స్థానాల్లో 95 లేదా 96 స్థానాలు బీసీలకు కేటాయించనున్న సమాచారం. జిల్లాలో 594 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 249 లేదా 250 సర్పంచ్ పదవులు బీసీలకు రిజర్వు అయ్యే అవకాశం ఉంది. 5058 వార్డు సభ్యుల స్థానాల్లో 2124 లేదా 2125 వార్డు సభ్యుల పదవులు బీసీలకు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. బీసీకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకువచ్చిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం వెలువడనున్నట్లు తెలుస్తోంది.

రుణమాఫీని వర్తింపజేయాలి

» మంత్రి శ్రీధర్‌బాబును కోరిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండల రైతులకు రుణమాఫీని వర్తింపజేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి సమస్యను వివరించారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘట్‌కేసర్ సహకార సంఘం ప్రతినిధులు నగరంలోని వారి కార్యాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీని చేసి ఘట్‌కేసర్ మండల రైతులకు మాఫీ చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఘట్‌కేసర్ సహకార సంఘంలో 1182మంది రైతులకు దాదాపు రూ.8కోట్ల90లక్షలు మాఫీ కావాల్సి ఉందన్నారు. రుణమాఫీ కోసం గత కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నట్లు మంత్రికి వివరించారు. ఈవిషయమై స్పందించిన మంత్రి ఆర్థికశాఖ, సీఎం దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, ఘట్‌కేసర్ సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి వైస్‌చైర్మన్ అనంతరెడ్డి, డైరెక్టర్లు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు


మంత్రి శ్రీధర్‌బాబుతో ఎమ్మెల్యే మల్లారెడ్డి, కేఎల్లార్, తదితరులు

నల్సార్‌లో విద్యార్థి అనుమానాస్పద మృతి

» ఆలస్యంగా వెలుగులోకి..

శామీర్‌పేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి సహస్రాన్స(22) శనివారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌కు చెందిన సహస్రాన్స నల్సార్‌లో బీఏ ఎల్ఎల్‌బీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇతని తమ్ముడు కూడా నల్సార్‌లోలా కోర్సులో మూడో సంవత్సరం చదుతున్నాడు. కాగా, ఈ విద్యార్థి క్యాంపస్‌లో శనివారం రాత్రి అనారోగ్యంతో బాధపడుతూ అల్వాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి వైద్య చికిత్స పొందగా పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి సుచిత్రలోని మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సహస్రాన్సను వైద్యులు అర్ధరాత్రి పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం నల్సార్ అధికారులు రాయ్‌పూర్‌లో ఉన్న సహస్రాన్స తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి సహస్రాన్స మృతదేహన్ని రాయ్‌పూర్‌లోని నివాసానికి తరలించారు. కాగా సహస్రాన్స మృతికి గల కారణాలు తెలియరాలేదు. సహస్రాన్స మృతిపై నల్సార్‌లోని పలువురు విద్యార్థుల వద్ద ఆరా తీయగా పలు రకాలుగా అనుమానాలు వ్యక్తం చేశారు. విద్యార్థి మృతి చెందడంతో అధికారులు మంగళవారం నుంచి నల్సార్ అకాడమికి సెలవులు ప్రకటించారు. కాగా, నల్సార్ విద్యార్థి అనుమానాస్పద మృతి పట్ల ఆంధ్రజ్యోతి ప్రతినిధి శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని వెల్లడించారు.

జీఎస్టీ తగ్గింపుతో ఆర్థికాభివృద్ధి

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశప్రజల ఆర్థికాభివృద్ధికే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు తెచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. పార్టీ షాద్‌నగర్ కన్వీనర్ టి.విజయ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం ఏబీ కాంప్లెక్స్‌లో జీఎస్టీ సంస్కరణపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ రాకతో కేంద్ర ఆదాయం రూ.ఏడు వేల కోట్ల నుంచి 22వేల కోట్లకు పెరిగిందన్నారు. ఈ నిధులతో విమానాశ్రయాలు, రైల్వేలు, హైవేలు, కేంద్ర విద్యాసంస్థల అభివృద్ధి చేపడుతున్నారని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజల ఆర్థికాభివృద్ధికి హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌లు, విద్యారంగంపై జీఎస్టీని ఎత్తివేశారని గుర్తుచేశారు. అయితే జీఎస్టీ మార్పులతో రాష్ట్ర ఆదాయం తగ్గుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత ఏర్పడిందన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరం కన్వీనర్ గోపాల్‌నారాయణ్ మాట్లాడుతూ.. షాపింగ్ మాల్స్‌లో పన్ను తగ్గించకుండా విక్రయిస్తే ప్రశ్నించాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, నాయకులు శ్రీపాల్‌గుప్తా, హరిభూషన్, వెంకటేశ్‌గుప్తా, అశోక్‌గౌడ్, భూపాల్‌చారి, మనోహర్‌రెడ్డి, నర్సింహగౌడ్, మోహన్‌నాయక్, చెట్ల వెంకటేశ్, ప్రశాంత్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


చంద్రప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నీటిసరఫరా సక్రమంగా జరపటంలేదని మేడ్చల్ మేన్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆరోపించారు. తన పార్టీ కార్యకర్తలతో కలిసి మంగళవారం ఆమె మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి తాగునీటి కష్టాలు పెరుగాయని ఆరోపించారు. మున్సిపల్ పరిధిలో సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపల్ పరిధి లోని పలుప్రాంతాల్లో హరితహారం కింద నాటిన చెట్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నరుకుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి ఎం.నరేష్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా మున్సిపల్ పరిధిలోని కేఎల్‌ఆర్ వెంచర్‌లో లక్షల రూపాయలు వెచ్చించి పెంచిన హరితహారం మొక్కలను కొందరు ప్లాట్ల యజమానులు నిర్లక్ష్యంగా నరికివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లు నరికిన వారిపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూర్ గ్రామం నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బొంరాస్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ పద్మావతికి ఫిర్యాదు చేశారు. సదరు కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల వెంకటయ్య, బుస్స చంద్రయ్య, కొత్తూర్ చంద్రయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తాండూరులో మెగా వైద్య శిబిరం

» ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన మెగా వైద్య బిరాన్ని మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అక్టోబరు 2 వరకు కొనసాగే ఈ శిబిరంలో మహిళల కోసం ప్రత్యేకంగా వైద్యసేవలు అందించనున్నారు. అనంతరం ఎమ్మెల్యే అక్కడ ఉన్న వైద్యులతో కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు బాల్‌రెడ్డి, అంజయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాండూరు నియోజకవర్గానికి చెందిన 157 మంది లబ్ధిదారులకు రూ.60లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, అజయ్‌ప్రసాద్ ఉన్నారు.

తాండూరు కవికి కీర్తి పురస్కారం

తాండూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం 2024 కీర్తి పురస్కారాలను ఎన్టీఆర్ కళా మందిరంలో అందజేసింది. ఇందులో భాగంగా తాండూరుకు చెందిన కవి, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి చంద్రశేఖర్‌కు కీర్తి పురస్కరాన్ని పద్మభూషణ్, శాంత బయోటిక్నిక్ వ్యవస్థాపకులు డాక్టర్ కేవీ వరప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయల కార్పొరేషన్ ఎండీ గణపతిరెడ్డి, సురవరం ప్రతాప్‌రెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుధండ నిత్యానందరావు పాల్గొన్నారు. చంద్రశేఖర్‌కు కీర్తి పురస్కారం రావడంపై తాండూరుకు చెందిన పలువురు అభినందించారు.


చంద్రశేఖర్‌కు కీర్తి పురస్కారాన్ని అందజేస్తున్న డాక్టర్ కేవీ వరప్రసాద్‌రెడ్డి

డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా పట్టించుకోరా?

వికారాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ పొంగుతున్న, దోమలతో ప్రజలు అవస్థలు పడుతున్న మునిసిపల్ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని అనంతగిరిపల్లిలో ఇండ్ల ముందు నుంచి డ్రైనేజీ పొంగిపోర్లుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. వార్డు అధికారికి పలుమార్లు చెప్పిన స్పందించడం లేదని, కనీసం గడ్డిమందు సైతం పిచికారి చేయడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అనంతగిరిపల్లిలో ఇళ్ల మధ్య పారుతున్న మురుగు

చెరువులకు జలకళ

● భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు


కొడంగల్ పెద్దచెరువు అలుగు వద్ద చేపలు పడుతున్న స్థానికులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో తాండూర్ మండలంలోని వాగులు, చెరువులు, కుంటల్లో వరద నీరు భారీగా చేరి జలకళను సంతరించుకున్నాయి. కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే పత్తి పంట కుదురుకుంటున్న సమయంలో వర్షాలు కురుస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోయారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వరద నీరు పత్తి పొలాల్లో చేరడంతో పత్తి కాయలు మురిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంగెం కలాన్, ఐనెల్లి వాగులు వరద నీటితో పొంగిపొర్లాయి. దీంతో తాండూర్-చించోలి రోడ్డుపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. వాగు ఉధృతి తగ్గిన తర్వాత వాహనాల రాకపోకలు కొనసాగాయి.

పొంగిపొర్లుతున్న చెరువులు


అలుగు పారుతున్న హస్నాబాద్ పెద్దచెరువు

దుద్యాల: కురిసిన భారీ వర్షాలకు దుద్యాల మండలంలోని చెరువులు వరద నీటితో పొంగిపొర్లుతున్నాయి. హస్నాబాద్ పెద్ద చెరువు మూడేళ్ల తర్వాత అలుగు పారడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. యాసంగిలో 950ఎకరాల్లో పంట సాగు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

జోరుగా చేపల వేట

కొడంగల్ రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. దీంతో చెరువులోని చేపలు వరదనీటితో పాటుగా అలుగు గుండా పొలాలకు వచ్చే కాల్వల్లోకి వస్తున్నాయి. కొడంగల్ పెద్ద చెరువు కింద మంగళవారం జోరుగా చేపల వేట కొనసాగింది. మండలంలోని పర్సాపూర్, హస్నాబాద్, గుండ్లకుంట, పాత కొడంగల్ తదితర గ్రామాల నుంచి యువకులు వచ్చి వలలతో చేపలు పట్టుకుని తీసుకెళ్తున్నారు.


సంగెంకలాన్-ఐనెల్లి వాగులో వరద నీటి ప్రవాహంతో నిలిచిన రాకపోకలు

కూలిన ఇల్లు

దౌల్తాబాద్: మండలంలోని దేవరఫస్లాబాద్‌లో కురుస్తున్న వర్షాలకు తలారి దస్తప్ప ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూలేకపోవడంతో ప్రమాదం తప్పిందని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం స్పందించి నష్టపరిహారంతో పాటు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య అన్నారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు


కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

మేడ్చల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఆవరణలో రెండో రోజు మంగళవారం బతుకమ్మ వేడుకలను జిల్లా పంచాయతీరాజ్, ఉద్యానవన, తూనీకలు, కొలుతలు, కార్మికశాఖ, జిల్లా హౌజ్ కీపింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, ఉపాధి కల్పనాధికారి రాధిక, కలెక్టరేట్‌లో పనిచేసే మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.


పరిగిలో బతుకమ్మ సంబురాలు

పరిగి: నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పరిగిలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. మాజీ జడ్పీటీసీ మలిపెద్ది మేఘమాల ప్రభాకర్ ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మలను తయారు చేశారు. ఆట, పాటలతో బతుకమమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటయ్య ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు.

విత్తనాల పంపిణీలో గోల్‌మాల్?

● వ్యవసాయ శాఖ అధికారుల చేతివాటం!


టెక్నికల్ ఏడీఏకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

దౌల్తాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే వేరుశనగ విత్తనాల పంపిణీలో గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోకఫస్లాబాద్ గ్రామాన్ని నేషనల్ సీడ్ కార్పొరేషన్ పథకం కింద ఎంపిక చేశారు. అందుకనుగుణంగా ఈ ప్రాంతంలో అత్యధికంగా నూనె ఉత్పత్తుల పంటలను రైతులు సాగుచేస్తారనే ఉద్దేశంతో ఎంపిక చేశారు. 100శాతం రాయితీపై 506బస్తాల వేరుశనగ విత్తనాలను రైతులకు అందించాలని ప్రభుత్వం సరఫరా చేసింది. కానీ వ్యవసాయ శాఖ అధికారులు 50శాతం సబ్సిడీపై 300బస్తాల పంపిణీతో పాటు క్వింటాలు వేరుశనగ విత్తనాలను రూ.6వేల నుంచి రూ.6,400 వరకు తీసుకొని 40కిలోలు ఉచితంగా అందిస్తున్నారు. ఇదేంటనీ రైతులు ప్రశ్నిస్తే 'ఇష్టం ఉంటే తీసుకోండి లేదా వెళ్లిపోండి' అంటూ ఏవో లావణ్య, కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏఈవోలు దురుసుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చేసేది లేక రైతులు దిక్కుతోచనిస్థితిలో కొనుగోలు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. తాజాగా ఈ విషయమై మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో టెక్నికల్ ఏడీఏ సంతోష్‌ను గోకఫస్లాబాద్ గ్రామ రైతులు, నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు.

గాంజా.. పంజా

(ఐదో పేజీ తరువాయి)

పలువురు గంజాయి మత్తులో మునిగి తేలుతుండగా, పట్టణానికి చేరువలో ఉన్న పలు గ్రామాల్లో సైతం గంజాయి ప్రభావం కనిపిస్తోంది. ఇటీవల జిల్లాలో గంజాయి బారిన పడే యువత సంఖ్య పెరుగుతండటమే ఇందుకు నిదర్శనం.

ఇరానీ గల్లీ టు వికారాబాద్

కర్ణాటక రాష్ట్రం, బీదర్ కేంద్రంగా గంజాయి దందా సాగుతోంది. బీదర్‌లో ఇరానీ గల్లీ నుంచి రైలు మార్గం ద్వారా జిల్లాకు అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడికి ఒకసారి వెళ్లిన వారు మరోసారి వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నట్లు చెబుతున్నారు. గంజాయి ప్యాకెట్ ఒకటి అక్కడ రూ.200 వరకు విక్రయిస్తుండగా.. డిమాండ్ మేరకు 20 నుంచి 100 వరకు ప్యాకెట్లు తీసుకువస్తున్నట్లు సమాచారం. బీదర్ నుంచి వికారాబాద్‌కు గంజాయిని తీసుకువచ్చే సమయంలో సరఫరాదారులు తమ బ్యాగులను ఇతర వ్యక్తులకు ఇచ్చి.. తమకు సంబంధం లేనట్లుగా ఉండి.. పట్టణం సమీపానికి వచ్చే సమయానికి గంజాయి ప్యాకెట్ల బ్యాగులను తాము ముందుగా అనుకున్న ప్రాంతంలో రైలులో నుంచి బయటకు పడివేస్తున్నట్లు సమాచారం. చాలా వరకు కొత్తగడి నుంచి గరీబ్ నగర్‌వరకు రైలు మార్గంలో తమ భాగస్వాములను మొహరిస్తున్నట్లు సమాచారం. రైలులో నుంచి బ్యాగులు బయటకు పడివేయగానే ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం రైలు మార్గం పక్కన వేచి ఉన్న గంజాయి సరఫరాదారుల్లో కొందరు వెంటనే ఆ బ్యాగులు తీసుకుని రహస్య ప్రాంతానికి తరలించి అక్కడి నుంచి విక్రయ ప్రాంతాలకు చేరవేస్తున్నట్లు సమాచారం. కొన్నేళ్లుగా గంజాయి అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతుండడం గమనార్హం. వికారాబాద్ రైల్వే జంక్షన్ కావడంతో ఇక్కడి నుంచి తాండూరుతో పాటు ఇతర ప్రాంతాలకూ గంజాయిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాజాగా గత ఆదివారం తాండూరుతో పాటు వికారాబాద్‌లో కూడా గంజాయి స్వాధీనం చేసుకున్న కేసు నమోదు కావడం గమనార్హం.

వారానికి ఒకసారి..

బీదర్ నుంచి వికారాబాద్‌కు గంజాయిని తరలించేందుకు ఒకసారి ఒక ప్రాంతానికి చెందిన వారిని గంజాయి కొరియర్ సేవలను వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. వారానికి ఒకసారి.. నెలకు నాలుగు నుంచి ఐదుసార్లు ఇక్కడి నుంచి బీదర్‌కు వెళ్లి రైలు మార్గంలో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం. గంజాయి తరలించేందుకు ఒక్కరే వెళితే పోలీసులు, నిఘా వర్గాలు అనుమానించే అవకాశం ఉన్నందున.. ఒక్కోసారి ఒకరిని ఈ పనికి వినియోగించుకుంటున్నట్లుగా తెలుస్తోంది. గంజాయిని రహస్యంగా ఇక్కడకు తీసుకు రావడమే కాకుండా గుట్టు చప్పుడు కాకుండా విక్రయించే వరకు పది మంది సభ్యులు ఉన్న నెట్‌వర్క్ పకడ్బందీగా పనిచేస్తున్నట్లు సమాచారం.

సవాల్‌గా మారిన విక్రయ కేంద్రం

ఇదిలా ఉంటే, బీదర్ కేంద్రంగా ఇక్కడకు సరఫరా అవుతున్న గంజాయిని పట్టుకోవడం ఎక్సైజ్ శాఖకు సవాల్‌గా మారింది. సమాచారం ఉన్నా... ఈ అక్రమ దందాను నిలువరించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. గంజాయి అక్రమ దందాకు కేంద్రంగా మారిన ఇరానీ గల్లీలో ఓ వర్గానికి చెందిన వ్యక్తులు గంజాయి దందాలో కీలకంగా వ్యవహరించడం వల్లనే ఎక్సైజ్, పోలీసు అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు చెబుతున్నారు. అక్కడికి వెళ్లిన వారిపై దాడులు చేయడంతో పాటు ఎంతటికైనా తెగించే విధంగా వారు వ్యవహరించే తీరు... పక్క రాష్ట్రం కావడంతో అక్కడి పోలీసుల మద్దతు తమకు ఉంటుందా, ఉండదా.. అనే కోణంలో అధికారులు ఆలోచిస్తూ ఇరానీ గల్లీకి వెళ్లడానికి వెనకాముందు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి జాయింట్ ఆపరేషన్ చేస్తే తప్ప గంజాయిని నిలువరించలేని పరిస్థితులు నెలకొన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గౌడ సంఘం మండల కార్యవర్గం


ఎన్నికైన గౌడ సంఘం నూతన కార్యవర్గం

చౌడాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల నూతన గౌడవ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా వెంకట్‌రాములుగౌడ్, సత్తయ్యగౌడ్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, నర్సిములుగౌడ్, గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, మాజీ ఎంపీపీ అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

అడవిలో చెట్ల తొలగింపు.. జేసీబీ సీజ్


అటవీ అధికారులు సీజ్ చేసిన జేసీబీ

తాండూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాస్నం అటవీ ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన గఫార్ జేసీబీతో నినావత్ వెంకటేష్ అడవిలో ఉన్న చెట్ల పొదలను తొలగించి భూమిని చదును చేయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు జేసీబీని సీజ్‌చేశారు. జేసీబీ ద్వారా గతంలో సంగాయిపల్లి తండా, బానాపూర్ తండాలో అడవిని నరికి వ్యవసాయం చేస్తూ ప్రతీసారి అక్రమంగా సాగుచేస్తున్న పంట పొలాల విస్తీర్ణాన్ని పెంచుతున్నారని అటవీ అధికారులు పేర్కొన్నారు. జేసీబీని వినియోగించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో ఎఫ్ఆర్ఓ రాజేందర్, ఎఫ్ఎస్ఓ కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా అమ్మవారు


అన్నోజిగూడలో..


ధారూరులో..

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు అమ్మవారు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని గాయత్రి ఆలయం, ధారూరు వీరభద్రేశ్వర అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు.

- ఘట్‌కేసర్/ధారూరు, సెప్టెంబరు 23

ఉల్లి.. తల్లడిల్లి!

(ఐదో పేజీ తరువాయి)

గుండ్లమడుగుతండా, మైసమ్మగడ్డ తండా తదితర గ్రామాల్లో యాసంగిలో రెండు వేల ఎకరాల్లో రైతులు ఉల్లిపంట సాగు చేస్తారు. దీని కోసం ముందస్తుగా తమ పంట పొలాల్లో ఒక మడిలో ఉల్లి నారు మడి వేసుకున్నారు. యాసంగి వరకు ఆ నారు నాటేందుకు సిద్ధమవుతుంది. అయితే భారీ వర్షాలకు ఉల్లి నారంతా నీటిలో మునిగి మురిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్న కొంతైనా బతుకుతుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. మండలంలోని ఒక్క మిట్టబాస్పల్లి గ్రామంలోనే రైతులు దాదాపు రూ.20 లక్షల విలువైన ఉల్లి విత్తనాలు చల్లగా భారీ వర్షాలకు నారు పూర్తిగా దెబ్బతిన్నది. ఉద్యానవన శాఖ అధికారులు గుర్తించి సబ్సిడీపై ఉల్లి విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

యాసంగికి నారు అందేలా లేదు



మాగ్రామంలో ఉల్లి పంటను ప్రధానంగా పండిస్తాం. యాసంగి కోసం గ్రామ రైతులం దాదాపు రూ.20 లక్షల విలువైన ఉల్లి విత్తనాలను చల్లాము. భారీ వర్షాల కారణంగా ఉల్లి నారంతా నీటిలో మునిగిపోయింది. యాసంగి సాగుకు నారు అందేలా లేదు. ప్రభుత్వం మా సమస్యను గుర్తించాలి. సబ్సిడీపై విత్తనాలివ్వాలి.

- షేక్ ఇస్మాయిల్, రైతు, మిట్టబాస్పల్లి

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

దుద్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంద్రకుంట తండా పంచాయతీ పరిధిలోని నన్యానాయక్ తండాకు చెందిన చందు నాయక్‌కు సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు రాహుల్, రతన్‌నాయక్, హీరమాన్ పాల్గొన్నారు.


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అదనపు టీచర్ పోస్టును భర్తీ చేయాలి


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజబొల్లారం అక్బర్జాపేటలోని ప్రాథమిక పాఠశాలలో అదనపు టీచర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల ఎంఈవో శంకరయ్యకు మంగళవారం వారు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. గ్రామ పాఠశాలలో అదనపు టీచర్ లేని కారణంగా విద్యార్థులకు బోధన సక్రమంగా జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు నర్సింగ్ రావు, వీరేష్, చారి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు


మందులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

కీసర రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అహ్మద్‌గూడలోని రాజీవ్ గృహ కల్ప(ఆర్జీకే) కాలనీలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు, స్థానికులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెంకటేష్, మున్సిపల్ అధికారి రాంరెడ్డి, రాములు, వైద్యులు సుధీర్, నేహ పాల్గొన్నారు.

దుద్యాల: స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హకీంపేట్ పీహెచ్‌సీలో ఉచిత చెవి, ముక్కు, గొంతు సమస్యలపై వైద్య శిబిరం నిర్వహించారు. 82మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు వైద్యురాలు వందన తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు జ్యోతి, విద్య, సూపర్‌వైజర్ వజ్రమాల, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, షాహేదాబేగం పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు

శామీర్‌పేట: గ్రామాల్లోని పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి లోపమున్న వారికి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు ఐజీఎఫ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ రవి, డాట్ల ఫౌండేషన్ కోఆర్డినేటర్ కృష్ణచైతన్యలు తెలిపారు. లాల్‌గడి మలక్‌పేటలో ఐజీఎఫ్ స్వచ్ఛంద సంస్థ, డాట్ల ఫౌండేషన్ బయోలాజికల్ కంపెనీ వారు సంయుక్త సహకారంతో మంగళవారం ఎంఎస్ రెడ్డి లైయన్స్ కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 100మంది కంటి లోపాలున్న వారికి లైయన్స్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేశారు. వీరిలో 22మందికి కంటి లోపాలున్నాయని, వీరికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

తాండూరు: అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం పతంజలి యోగ సమితి, ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. 10మంది ఆయుర్వేద వైద్య బృందం వివిధ రకాలైన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించి ఔషధాలను ఉచితంగా అందజేశారు. 224 మందికి పరీక్షలు చేసినట్లు డాక్టర్ కమల తెలిపారు. కార్యక్రమంలో, పతంజలి రాష్ట్ర ఉపాధ్యక్షులు పటేల్ శివకుమార్, శ్రీనివాస్, వినోద్ కుమార్, ప్రవీణ్, తిప్పయ్య పాల్గొన్నారు.

ఘనంగా చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు


తాండూరు: చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పండితుల ఆశీర్వాచనలు


చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, తదితరులు


పెద్దేముల్: మహేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి

తాండూరు/తాండూరు రూరల్/పెద్దేముల్/నవాబుపేట/శామీర్‌పేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం శుభాకాంక్షల సందేశాన్ని పంపించారు. రేవంత్‌రెడ్డితో పాటు ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు జితేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రంగారెడ్డి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జడ్పీమాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతికి చెందిన వేద పండితులు మహేందర్‌రెడ్డి దంపతులకు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులుండాలని ఆశీర్వచనాలు ఇచ్చారు. హైదరాబాద్‌లో డీసీసీబీ వైస్ చైర్మన్ రవీ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కరుణం పురుషోత్తం రావు, మల్కాపూర్ జనార్థన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు శోభారాణి, పరిమళ, వీరశైవ సమాజం ప్రతినిధులు ఆర్.బసవరాజ్, గాజుల శాంత్‌కుమార్, తంబాకు చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. మొయినాబాద్ ప్రాంతంలో పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంపల్లి రాజేందర్‌తో పాటు పలువురు నాయకులు పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. చీఫ్‌విప్ జన్మదిన సందర్భంగా యువ నాయకులు బిడ్గర్ రఘు ఆధ్వర్యంలో యువకులు రక్తదాన శిబిరం చేశారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు.పీ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కార్యదర్శి పురుషోత్తంరావు, పరిమళ, అబ్దుల్ కవి, భగవాన్, పునిత్, శివానంద్ పాల్గొన్నారు. అనంతరం మహేందర్‌రెడ్డిని గజమాలతో సన్మానించారు. అదేవిధంగా మహేందర్ రెడ్డికి పెద్దేముల్ మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నివాసానికి పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. అదేవిధంగా చీఫ్‌విప్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, మేడిపల్లి వెంకటయ్య, సామ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని చీఫ్‌విప్ నివాసంలో దేవరయాంజాల్‌కు చెందిన మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, పార్టీ తదితర నాయకులు మహేందర్‌రెడ్డిని కలిసి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


నవాబుపేట: పట్నం మహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


తాండూరులో రక్తదానం చేస్తున్న మహేందర్‌రెడ్డి అభిమానులు


పట్నం మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అంపల్లి రాజేందర్ తదితరులు


శామీర్‌పేట: చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలను తెలుపుతున్న మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి


మహేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మహిళా నాయకురాళ్లు

సామూహిక యజ్ఞ కార్యక్రమాలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న హీరాలాల్

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 23 ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో నవంబరు 16వ తేదీన నిర్వహించనున్న సాముహిక యజ్ఞ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యాత్మిక ధార్మిక సేవా సమితి అధ్యక్షుడు హీరాలాల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నవంబర్ 16వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు మలయాళస్వామి ఆశ్రమ పీఠాధిపతులు దయానందగిరి స్వాములచే 108మంది దంపతులతో సామూహిక యజ్ఞ కార్యక్రమాలు, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావుచే దివ్య ప్రవచనామృతం ఉంటుందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 1:30గంటల నుంచి మళయాళ స్వామి ఆశ్రమ పీఠాదిపతులు దయానందగిరి స్వాములచే ప్రవచనాలు, ఇతరుల ఉపన్యాసాలు, భజన కార్యక్రమాలు నిర్వహించబడుతాయని ఆయన తెలిపారు. పాల్గొనే వారు అధ్యాత్మిక ధార్మిక సేవ సమితి అధ్యక్షులు హీరాలాల్, సభ్యులు తుకారం వద్ద పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

దోమ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంట సాగు చేసిన ప్రతీ రైతు వివరాలను ఈ నెల 26లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏవో ప్రభాకర్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంటలు సాగు చేసుసుకునే రైతులు పంటల వివరాలను ఆయా క్లస్టర్‌ల ఏఈవోల దగ్గర నమోదు చేసుకోవాలన్నారు. పంటల నమోదుతో మార్కెట్‌లో విక్రయించుకునేందుకు సులభంగా ఉంటుందన్నారు.